ప్రజాశక్తి
గురువారం 15 డిసెంబర్ 2022

బాల్యవివాహం అడ్డగింత

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడలో బాల్య వివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఐసిడిఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొమరాడ మండల కేంద్రంలో దాసరి పోలీసు తన కుమార్తెకు 18 ఏళ్లు నిండకుండానే బుధవారం వివాహం చేసేందుకు నిర్ణయించారు. గ్రామస్తుల నుంచి ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందడంతో అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు పెళ్లి వద్దకు వచ్చి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండకుండానే కుమార్తెకు వివాహం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పెళ్లిని విరమించుకుంటున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు పైబడిన తర్వాతే తమ కుమార్తెకు వివాహం చేస్తామని అధికారులకు రాతపూర్వకంగా లేఖ అందజేశారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

సిఐటియు జిల్లా నూతన కమిటీతో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఐక్య పోరాటాలకు అన్ని రంగాల కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. పార్వతీపురం పట్టణంలోని శ్రీవిజయలక్ష్మి కళ్యాణ మండపంలో సిఐటియు పదో జిల్లా మహాసభ బుధవారం రెండో రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు, కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచిందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మిక హక్కులను హరించేందుకు కార్మిక కోడ్‌లు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు చేస్తే నిర్బంధాలకు పాల్పడి, అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులను చట్టబద్ధంగా పొందేందుకు ఐక్య పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పిలుపునిచ్చారు.

మహాసభలో పలు తీర్మానాలు

సిఐటియు జిల్లా మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. అందులో కొన్ని...

- కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి.
- పెరిగిన ధరలను అదుపుచేయాలి.
- ప్రభుత్వ రంగ ఆస్తుల ప్రయివేటీకరణను ఆపాలి.
- పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు జరగకుండా చూడాలి.
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి.
- కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి.
- అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- స్కీమ్‌వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

దావాల రమణారావు

వై.మన్మథరావు

జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా రమణారావు, మన్మథరావు ఎన్నిక

అనంతరం సిఐటియు పార్వతీపురం మన్యం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులుగా దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శిగా యమ్మల మన్మథరావు, కోశాధికారిగా గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా రెడ్డి వేణు, వి.ఇందిర, ఎన్.వై.నాయుడు, కోలక అవినాష్ కుమార్, సహాయ కార్యదర్శులుగా వి.రామలక్ష్మి, బి.వి.రమణ, ఆర్.రాము, జి.జ్యోతి, ఎం.ఉమామహేశ్వరి, వై.శాంతికుమార్, ఒక కోఆప్షన్ సభ్యులుతోపాటు 29 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు పనులు వేగవంతం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పాచిపెంట

రోడ్డు పనులు వేగవంతం చేసి, వచ్చే జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పాచిపెంట మండలంలోని మారుమూల కొండ ప్రాంతమైన నీలమ్మ వలస నుండి గుమ్మడిగూడ వరకు నిర్మాణంలో ఉన్న రహదారిని పరిశీలించారు. ఆర్‌సిపిఎల్‌డబ్ల్యుఇ నిధులు సుమారు రూ.3.76 కోట్లతో నిర్మిస్తున్న బిటి రహదారి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ తిరుపతి రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సాలూరు మండలం ఎన్‌హెచ్ 43 నుండి కరడ వలస, పాచిపెంట మండలం ఆజూరు నుంచి పందిరి మామిడి వలస వరకు నిర్మిస్తున్న రహదారి పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రోడ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.వి.ఆర్.కృష్ణాజీ తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాచిపెంట మండలం రాయిగుడ్డి వలస, గురివినాయుడిపేటలోని నిర్మాణంలోనున్న గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. నిర్మాణ పనులు జాప్యానికి గల కారణాలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను అడగ్గా ఇటుకలకు డిమాండ్ ఉన్నందున పనులు ఆలస్యం అవుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ దగ్గరలో ఇటుకల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇఇ చిన్నంనాయుడు, డిఇ శర్మ, జెఇ ప్రసాద్, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఒ ఆత్మహత్య

ప్రజాశక్తి-మక్కువ, సాలూరురూరల్

మక్కువ మండలంలోని కొండబుచ్చింపేట గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. సాలూరు మండలం మామిడిపల్లి పంచాయతీ విఆర్‌ఒగా సంతోష్ విధులు నిర్వహిస్తున్నారు. సన్యాసిరాజపురం పంచాయతీ పరిధిలోని అంటివలస సమీపంలో ఉన్న తోటలో సంతోష్ షర్టుతో ఉరివేసుకున్నాడు. సంతోష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విఆర్‌ఒ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పెట్రోల్ బంకుల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న జెసి ఆనంద్

అందుబాటులో పెట్రోల్ బంకులు

జెసి ఆనంద్

ప్రజాశక్తి-కొమరాడ

వాహనదారులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. బుధవారం మండలంలోని జెసి ఆనంద్ విస్తృత పర్యటన చేపట్టారు. ముందుగా మండల కేంద్రంలో ఉన్న సొసైటీ గోడౌన్ నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ఐటిడిఎ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం కొమరాడ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, దేవకోన వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పెట్రోల్ బంకుల ఏర్పాటు నిమిత్తం పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న ఖాళీ ప్రదేశం పెట్రోల్ బంకులకు అనుకూలంగా ఉందా? లేదా? అని వివరాలు ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ఏమేరకు జరుగుతుంది, రైతుల వద్ద నుంచి ధాన్యం తేమశాతాన్ని ఏ విధంగా పరిశీలిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం చూసే యంత్రం పనితీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ రాధాకృష్ణ, ఎఒ శంకరరావు, వివిధ అధికారులు ఉన్నారు.

కురుకుట్టి వ్యవహారంలో..

మితిమీరిన రాజకీయ జోక్యం

ఆలస్యమైనా అధికారుల స్పందనపై హర్షం

ప్రజాశక్తి-సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో సంచలనం సృష్టించిన కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఉదంతంలో మితిమీరిన రాజకీయ జోక్యం సమస్య పరిష్కారాన్ని ఎంత జఠిలం చేసిందో తేటతెల్లమైంది. నిబంధనల ప్రకారం అధికారులను పనిచేయనీయకుండా అధికారపార్టీ నాయకులు అడ్డుతగలడంతో గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తీసుకొచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఏ శాఖలోనైనా తప్పు చేసిన ప్రభుత్వ ఉద్యోగికి సస్పెన్షన్ అనే శిక్ష సాధారణమైనది. తప్పుచేసినట్లు ప్రాథమిక ఆధారాలు లభిస్తే ఉన్నతాధికారులు సస్పెండ్ చేసి విచారణకు ఆదేశిస్తారు. రాజకీయ పలుకుబడి ఉంటే సస్పెండ్ అయిన నెల రోజుల్లోనే తిరిగి ఎక్కడో ఒక చోట పోస్టింగ్ పొందిన ఘటనలూ ఉన్నాయి. ఇది అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ జరుగుతున్న వ్యవహారమే. అయితే కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక ఆధారాల ప్రకారం హెచ్‌ఎం కృష్ణారావుపై చర్యలు తీసుకోలేదు.

అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే అతి విశ్వాసంతో హెచ్‌ఎం కృష్ణారావు వ్యవహరించినా.. సమస్య జఠిలమై ఫోక్సో కేసు కూడా నమోదైంది. ఈ వ్యవహారంలో తొలిదశలో అప్పటి ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగా ఉన్న జాయింట్ కలెక్టర్ ఆనంద్.. హెచ్‌ఎం

కురుకుట్టిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల

కృష్ణారావును సస్పెండ్ చేయాలని భావించారు. రాజకీయ ఒత్తిడి కారణంగా చర్యలు తీసుకోకపోవడంతో రెండో విడత విచారణకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెప్టెంబరు 17న తొలిసారి విచారణ నిర్వహించిన సహాయ గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదు. తొలివిడత విచారణ నివేదికలో బాలికలు చెప్పిన దానికి భిన్నంగా ఉందని, హెచ్‌ఎం కృష్ణారావుకు అనుకూలంగా ఉందనే విషయం గిరిజన సంఘాల దృష్టికి వెళ్లింది. అందువల్లే ఆయనపై చర్యలు తీసుకోకుండా మరో పాఠశాలకు బదిలీ చేస్తూ అధికారులు చేతులు దులిపేసుకున్నారు. దీనిపై భగ్గుమన్న గిరిజన సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌కి మళ్లీ ఫిర్యాదు చేయడంతో రెండో విడత విచారణకు ఆదేశించారు. మహిళా అధికారులతో విచారణ చేపట్టాలని సంఘాలు కోరడంతో ఆర్‌డిఒ హేమలత ఆధ్వర్యాన విచారణకు ఆదేశించారు. నవంబరు ఐదో తేదిన ఆర్‌డిఒ హేమలత నేతృత్వంలో ముగ్గురు మహిళా అధికారులు పాఠశాలలో సుదీర్ఘ విచారణ చేపట్టారు. విద్యార్థినులు చెప్పింది చెప్పినట్టుగా నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఫోక్సో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్‌డిఒ హేమలత బృందం విచారణ నివేదిక ఆధారంగా జిల్లా అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి కూడా తటపటాయించారు. ఏమైనా ఈ వ్యవహారంలో కాస్త ఆలస్యమైనా జిల్లా అధికారులు హెచ్‌ఎం కృష్ణారావును సస్పెండ్ చేయడంపై గిరిజన సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పని సర్దుబాటులో

అవకతవకలు

వెంటనే సరిచేయాలని యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో పని సర్దుబాటులో అవకతవకలను సరి చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి టి.రమేష్, ఎస్.మురళిమోహన్‌రావు ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. డిఇఒ నిబంధనలకు విరుద్ధంగా పని సర్దుబాటు చేశారని తెలిపారు. అర్హత కలిగిన వారిని సర్దుబాటు చేయకుండా అర్హత లేని వారికి అవకాశమిచ్చారని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ (గణితం)గా పనిచేస్తున్న సీనియర్‌ను దూరం వేసి, ఎస్‌జిటిలను దగ్గరగా వేశారని తెలిపారు.

బందలుప్పి, తాళ్ళబురిడి ప్రాథమిక పాఠశాలలో రోల్ ఉన్నప్పటికీ ఎస్‌జిటిలను వేయలేదని పేర్కొన్నారు. ఎన్.ములగ హైస్కూల్‌లో కలిపేసిన ఎస్‌జిటిలను అదే స్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా నియమించడానికి అర్హత ఉన్నప్పటికీ 20 కిలోమీటర్ల దూరంలో ఎస్‌జిటిగా వేశారని తెలిపారు. వీటన్నింటిపైనా డిఇఒ, డిప్యూటీ డిఇఒలకు విన్నవించినా సరిచేయలేదని వెల్లడించారు. ఇప్పటికైనా విచారణ చేపట్టి, చర్యలు తీసుకుని సర్దుబాటును సవరించాలని, లేకుంటే డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీ దండుసుర నుంచి జియ్యమ్మవలస మండలం పి.టి.మండ వరకు చేపట్టనున్న రహదారి పనులకు ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి బుధవారం ప్రారంభించారు. రూ.5 కోట్ల నిధులతో 5.6 కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీటి, విద్య, వైద్యం అందనంత ఎత్తులో ఉండేవని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో సమస్యలు తెలుసుకుని ఇచ్చిన హామీలను మూడున్నరేళ్లకే 90 శాతం నెరవేర్చారని తెలిపారు. ఇప్పుడు గిరిజన ప్రాంతానికి రహదారి, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించి గిరిజన పక్షపాతి అయ్యారన్నారు.

ఈ సందర్భంగా దండుసుర గిరిజనులు మాట్లాడుతూ ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి మంజూరు చేయించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి కృతజ్ఞతలు తెలిపారు. కురుపాం మండల కేంద్రానికి వెళ్లాలంటే 50 కిలోమీటర్లు దూరం ఉండేదని, ఈ రహదారి నిర్మిస్తే 25 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. అత్యవసర సమయంలో వైద్యానికి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లడానికి వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, సర్పంచ్ ఎ.మన్మథరావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు అంధవరపు కోటేశ్వరరావు, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు

ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి-కొమరాడ

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ అన్నారు. బుధవారం గంగరేగువలస రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు మండలంలో ఏవిధంగా జరుగుతుందని ఎఒ పి.శంకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. మండలానికి 15 వేల గోనె సంచులు అవసరం కాగా, 9 వేలు మాత్రమే అందుబాటులో ఉండడంతో రైతులు కొంతమేర ఇబ్బంది పడుతున్నట్లు పిఒ దృష్టికి తీసుకువెళ్లారు. అవసరమైన సంచులను ఇప్పటికే ప్రతిపాదన పెట్టామని ఎఒ తెలిపారు. రైతులు దళారుల మాటలను నమ్మి మోసపోయి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని పిఒ కోరారు. పెద ఖేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రైతులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రికి సాదర స్వాగతం

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల ఎమ్మెల్యే కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బుధవారం సాయంత్రం విశాఖపట్టణం జిల్లా దాకమర్రి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సాదర స్వాగతం లభించింది. స్థానిక రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్‌సిసి మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న ముఖ్యమంత్రికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. పర్యటనలో భాగంగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, తితిదే ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జున సిఎంతో పాటు హెలికాప్టర్‌లో విచ్చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, భీమిలి, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, పాతపట్నం ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, అలజంగి జోగారావు, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు సురేష్ బాబు, రఘురాజు, పాలవలస విక్రాంత్, వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్, వరుదు కళ్యాణి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తదితరులు సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కె. విశ్వనాథన్, విజయనగరం, భీమిలి ఆర్డీవోలు సూర్యకళ, సుధాకర్ రెడ్డి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ

ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

మండలంలో రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలను డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ఆయా సబ్జెక్టులు వారీగా బోధన అంశాలపై చర్చించారు. పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. టైంటేబుల్ అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులు ఎం.తిరుపతిరావుకు, డిప్యూటీ వార్డెన్‌కు, ఉపాధ్యాయులకు సూచించారు.

పూర్ణపాడు వంతెన పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొమరాడ

దీర్ఘకాలంగా నిలిచిపోయిన పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు ప్రారంభమైనట్లు సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. పనులు ప్రారంభం కావడంతో ఈ నెల 16 నుంచి చేపట్టే నిరాహార దీక్షను తాత్కాలికంగా విరమించుకున్నట్లు ప్రకటించారు. వంతెన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రజల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి తెలిపారు. నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ప్రజా ప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు, పౌర సమాజ సభ్యులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో పట్టణంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృత స్థాయిలో చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నీడ్ సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ నీటిని వృథా చేయొద్దని కోరారు. అనంతరం యూనిసెఫ్ రీజనల్ కోఆర్డినేటర్ చంద్రకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఇన్‌ఛార్జి పీడీ విజయగౌరి, సిఎంఎం విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

16న బట్టిమొగవలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పార్వతీపురం

కొమరాడ మండలం బట్టిమొగవలస గ్రామంలో ఈ నెల 16న మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ బి.ఎస్.బి.రావు తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ నిశాంత్ కుమార్ మెగా వైద్య శిబిరం బ్రోచర్ ను విడుదల చేశారు. ప్రజలందరూ ఈ వైద్య శిబిరంలో సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పి.సూర్యారావు, మెంబర్లు పి.ప్రకాశ్, బి.జయబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎస్ఐ నీలకంఠం

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-సీతానగరం

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్ఐ కె.నీలకంఠం కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణాన్ని కాపాడేందుకు మొక్కలు ఎంత దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వాసుదేవనాయుడు, సాంబ, పోలీస్ సిబ్బంది రామకృష్ణ, రమణ, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామంలో త్వరలో చేపట్టే భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ జల్లేపల్లి మాధవి సూచించారు. బుధవారం మండలంలోని కత్తులకవిటి గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. సర్వే చేసినప్పుడు రైతులు దగ్గరుండి తమ భూములను సరిచూసుకోవాలని సూచించారు. ఎటువంటి లోపాలున్నా సరిదిద్దుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల సరోజినీ, జంపు ఉమామహేశ్వరరావు, ఎంఆర్ఐ జి.ప్రసాదరావు, గేదెల సుదర్శనరావు, విఆర్ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇఒగా రాధాకృష్ణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మక్కువ

శంబర పోలమాంబ దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వి.రాధాకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఇఒ బిఎల్ నగేష్ నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అందరి సహాయ సహకారాలతో జాతర దిగ్విజయంగా సాగేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

దళారులను నమ్మి మోస పోవద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బుధవారం కలవరాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వేగవం తంగా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొత్స నటరాజ్, ఎంపిటిసి పాటూరు సింహాచలం, తహశీల్దార్ నమ్మి రాజారావు, అగ్రికల్చర్ ఏడి శ్యాంసుందర్రావు, పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ సాయికృష్ణ, మాజీ సర్పంచ్ బొత్స విశ్వనాథం, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా గోపాలరాయుడుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వైసిపి అధ్యక్షులు సంబంగి వేణుగోపాల్ నాయుడు ప్రారంభించారు.

4 నెలల బకాయి వేతనాలు మంజూరు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఆదివాసీ సవర మాతృ భాషా విద్యా వాలంటీర్ల నాలుగు నెలల వేతనాలను పిఒ నవ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆదివాసీ మాతృ విద్యా వాలంటీర్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి డుంబు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు వేగవంతం

బొబ్బిలి : మున్సిపాలిటీలో 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. తన కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 65 పనులకు రూ.4.91కోట్లతో టెండర్ పూర్తి అయితే ఇప్పటి వరకు రూ.2.08కోట్లతో 28పనులు పూర్తయ్యాయని చెప్పారు.

కురుపాంలో టిడీపి

ఎన్నికలు సమీపించే కొద్దీ అంతర్గత పోరును పక్కనపెట్టి, సమిష్టిగా పనిచేసి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సంబంధిత పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తుంటారు. ఈ మేరకు అధిష్టానం కూడా నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తుంటుంది. అయితే అదేమి విచిత్రమో తెలియదు గాని, అందుకు పూర్తి భిన్నంగా కురుపాం నియోజకవర్గంలో టిడిపి వ్యవహారం నడుస్తోంది. ఏళ్ల తరబడి టిడిపిలో గ్రూపులపోరు చాపకింద నీరులా తయారైంది. జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే కురుపాం నియోజకవర్గంలో టిడిపి పరిస్థితి రోజురోజుకీ దయనీయంగా తయారవుతోందనడంలో సందేహం లేదు.

- కొనసాగుతున్న గ్రూపుల పోరు
- వేర్వేరుగానే కార్యక్రమాలు
- పట్టించుకోని అధిష్టానం
- నాయకుల తీరుపై శ్రేణుల అసహనం

ప్రజాశక్తి - కురుపాం

మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు చొరవతో టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తోయక జగదీశ్వరిని అధిష్టానం నియమించింది. ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించిన బిడ్డిక పద్మావతి, బిడ్డికి తమ్మయ్య, పువ్వల లావణ్య, విజయ్‌కుమార్, భూపతిదొర తదితరులను కలుపుకొని వెళ్లకుండా ఇన్‌ఛార్జి కేవలం విజయరామరాజు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారనేది ఆశావహుల ఆరోపణ. దీంతో ఆశావాసులంతా ఏకతాటిపైకి వచ్చి గ్రంథాలయ సంస్థ పూర్వ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో మరో గ్రూపుగా ఏర్పడ్డారు. టిడిపి అధిష్టానం ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే రెండు గ్రూపులు పోటాపోటీగా బలనిరూపణకు దిగుతున్నాయి. ఇటీవల కొంతకాలం స్తబ్ధతగా ఉండి దత్తి లక్ష్మణరావు మనవరాలు బారసాల కార్యక్రమానికి విజయరామరాజు గ్రూపు అంతా వెళ్లడంతో రెండు గ్రూపులూ ఒకటవుతాయని కార్యకర్తలు ఆశపడ్డారు. అది మూడు రోజులు ముచ్చటగా మిగిలింది. బుధవారం కురుపాం మండలంలో ఇదేం కర్మ కార్యక్రమం ప్రారంభంలో మళ్లీ గ్రూపుల గోల రచ్చకెక్కిందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో తిత్తిరి, వలసబల్లేరు పంచాయతీలో దత్తి లక్ష్మణరావు ఆశావాసులతో కలిసి ఇదేం కర్మ కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్సీ విజయరామరాజు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరితో కలిసి ఉదయపురం పంచాయతీ కాకితాడ గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలా అయితే కురుపాం నియోజకవర్గంలో టిడిపికి గడ్డుకాలం తప్పదనే ఆందోళనలో పార్టీ శ్రేణులున్నాయి. ఈ నేపథ్యంలో అధిష్టానం చొరవ తీసుకొని రెండు గ్రూపులను ఏకతాటిపైకి తీసుకొస్తుందో, లేదో వేచి చూడాల్సిందే.

ఉదయపురంలో విజయరామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం కర్మ కార్యక్రమం

దత్తి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇదేం కర్మ కార్యక్రమం

ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి

డిపిఒ సత్యనారాయణ

సీతానగరం.. మాట్లాడుతున్న డిపిఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-సీతానగరం

సరైన ప్రణాళికలతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచులు, ఎంపిటిసిలకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా గ్రామాల అభివృద్ధికి ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలన్నారు వాటి కోసం ఏయే రంగాల్లో ఆర్థిక వనరులు ఉన్నాయో ముందుగా ఒక ప్రణాళికలు తయారు చేసుకొని, వాటి ఆధారంగా ఆదాయాన్ని పెంచుకొని, గ్రామ అభివృద్ధికి నిధులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి, ఎఒ ఎంఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎపిఎం ఆర్.శ్రీరాములు, ఎంఇఒ జి.సూరిదేముడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్‌కుమార్, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాలాభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు ఖర్చుపై అవగాహన అవసరమని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఏ అవసరాల కోసం ఏ నిధులను ఉపయోగించవచ్చు, ఎంత మేరకు ఖర్చు చేయొచ్చు అనే అంశంపై ప్రజా ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎస్.రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ వద్ద ఎదురెదురుగా ఢీకొన్న లారీ

ఎదురెదురుగా లారీలు ఢీ

భారీగా నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి-కొమరాడ

మండల కేంద్రంలో రెండు లారీలు ఢీకొన్న ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కొమరాడ మండల కేంద్రంలో జరిగిన ఈ ప్రమాదంతో రోడ్డుపైన రెండు లారీలు అడ్డుగా ఉండిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో పార్వతీపురం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న కర్రల లోడు లారీలో ఉన్న డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ జగదీష్ నాయుడు సంఘటనా స్థలానికి తన సిబ్బందితో చేరుకున్నారు. క్రేన్ సహాయంతో లారీలను పక్కకు తీశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అర్హులందరికీ పథకాలు

ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి-వీరఘట్టం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. బుధవారం వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చిపువలస గిరిజన గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నామని తెలిపారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వీరఘట్టం చేరుకొని గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ధమలపాటి వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పి.గౌరమ్మ, ఎంపిడిఒ ఎ.ప్రభాకర్‌రావు, ఎపిఎం జి.శివున్నాయుడు, ఎపిఒ జి.సత్యంనాయుడు, పిఎసిఎస్ డైరెక్టర్లు బి.లక్ష్మీనారాయణ, రంభ శ్రీనివాసరావు , భోగి మాణిక్య చంద్రశేఖర్, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పార్కులో వికలాంగ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

విజయనగరం జిల్లా పూసపాటిరేగలోని వికలాంగుల ఆశ్రమం నుంచి సుమారు 80 మంది విద్యార్థులు సీతంపేట అడ్వెంచర్ పార్కును బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ బి.నవ్య వారితో కాసేపు ముచ్చటించారు. వైకల్యం వల్ల కృంగిపోకూడదని, దానిని ఎదిరించి జీవితంలో ముందుకు సాగాలని పిఒ అన్నారు. విద్యార్థులు పార్కులో బోటింగ్‌తోపాటు వివిధ క్రీడల్లో పాల్గొని ఆనందంగా గడిపారు. వీరికి పార్కు మేనేజర్ రాజు అన్ని ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ నవ్య

గిరిజన గ్రామాల్లో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి-సీతంపేట

కిల్లాడ పంచాయతీ దంజుపాయి, చింతమానుగూడ, అప్పన్నగూడ, జగ్గడుగూడ, దారపాడు పంచాయతీ బూర్జ గూడ, కోసంగి, దబర గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట ముఖలింగం, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి బిడ్డిక చందరరావు, తెలుగురైతు మండల అధ్యక్షులు సవర సోడంగా, మాజీ సర్పంచ్ బిడ్డిక స్వామినాయుడు, మండల ప్రధానకార్యదర్శి సుబ్బారావు, మండల మహిళా అధ్యక్షులు ఆరిక సువర్ణ, సీనియర్ నాయకులు మండంగి ప్రకాష్, సవర బుడ్డయ్య, గేదల కాంతారావు, కూరంగి సుందరరావు పాల్గొన్నారు.

సాలూరురూరల్.. కార్యక్రమంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి

సాలూరు రూరల్ : మండలంలో మావుడి, సోమడవలస, పురుగాని వలస, కొత్తవలస గ్రామాల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి ఆధ్వర్యాన ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పరమేష్, తెలుగు రైతు నాయకులు బూస తవుడు, యుగంధర్, తిరుపతిరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గురుకుల బాలికల ప్రతిభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పిటిజి గురుకుల బాలికల విద్యార్థినులు మ్యాథ్స్ విభాగంలో ప్రథమ స్థానం సంపాదించారు. విద్యార్థులోపాటు ఉపాధ్యాయులు వై.ఉషారాణి, గౌరిలను ప్రిన్సిపల్ కమల కుమారి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, డిప్యూటీ వార్డెన్ నల్ల గిరిజ అభినందించారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా అప్పారావు

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడ ఇన్‌ఛార్జి ఎంపిడిగా ఎల్‌వి అప్పారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా చేస్తున్న అప్పారావును కొమరాడ మండలానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నియమించారు.

అర్హులకు పట్టాలు మంజూరు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలో ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించి పట్టాలను మంజూరు చేస్తామని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. బుధవారం మండలం, రెళ్ళ, వంగర, కేదారిపురం, నోంద్రకోన తదితర గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి గిరిజనులతో మాట్లాడారు. ఎవరికైనా ఇళ్ల స్థలాలు అవసరం మేరకు గుర్తించి తగు మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం బీరుపాడు గ్రామంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజేంద్ర ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేసి అవసరమైన గిరిజనులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తామని తెలిపారు.

రబీ పంటలతో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రబీ సీజన్‌లో రాగి పంటతోపాటు 4 నుండి 5 రకాల పంటలు వేయటం వల్ల అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రబీ సీజన్లో పంటలు వేయడం వల్ల నేల సారవంతం అవుతుందన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందిరానగర్ కాలనీకి చెందిన యువకుడు పి.రాజశేఖర్(21) మృతిచెందాడు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని పక్కనే ఉన్న కాలేజీ బస్సు వెనుక టైర్ కింది పడి రాజశేఖర్ మృతిచెందాడు. తలకు బలమైన గాయమవడంతో ఏరియా ఆస్పత్రిలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. రాజశేఖర్ తండ్రి రామ్మూర్తి గతంలో రేగిడి తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ మృతిచెందారు. తల్లి వరహాలమ్మ ఉన్నారు.

మృతిచెందిన రాజశేఖర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని కొంకివీధిలో గంగుల నాగరాజు (30) తన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్ఐ పాపారావు చెప్పారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మనస్తాపంతో బుధవారం ఇంట్లో బెడ్‌రూంలో చీరతో ఉరివేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి గంగుల ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని కోన గ్రామానికి చెందిన తుడుము గౌరయ్య (75) మృతదేహం సువర్ణముఖి నది ఒడ్డున బుధవారం లభ్యమైంది. మతిస్థిమితం లేకపోవడంతో ఐదు రోజుల క్రితం నుంచి గౌరయ్య కనిపించడం లేదు. దీంతో అల్లుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎస్.తిరుపతి వెతకసాగారు. బుధవారం మధ్యాహ్నం డి.సిర్లం సమీపంలోని సువర్ణముఖి నది ఒడ్డున గౌరయ్య మృత దేహం లభించింది. దీంతో మక్కువ పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎఎస్ఐ రమణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని సాలూరు సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పి.లేవిడి గ్రామానికి చెందిన కుమ్మరి రామారావు వద్ద అక్రమంగా ఉన్న 10 లీటర్ల నాటు సారాను నీలకంఠాపురం ఎస్ఐ డి.అనిల్ కుమార్ బుధవారం స్వాధీనం చేసుకొన్నారు. ఆయనపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.